సాక్షి నిజామాబాద్

మంగళవారం । 29 । జూలై । 2025



ఆలయాల అభివృద్ధికి..

ఆలయాల అభివృద్ధికి చైర్మన్‌తో సహా కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు.

- 8లో ▸



ఆహార పదార్థాలు..

ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /22.7

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు ఇన్‌చార్జి మంత్రి సీతక్క రాక



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) నిజామాబాద్ నగరంలో మంగళవారం పర్యటించనున్నారు. మధ్యాహ్నం నగరానికి చేరుకోనున్న ఆమె.. 3గంటలకు కలెక్టరేట్ సముదాయంలో నిర్వహించనున్న సమీక్షాసమావేశంలో పాల్గొంటారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ తరువాత హోటల్ హరితలో నిర్వహించనున్న కాంగ్రెస్ ఆదివాసీ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కార్యకర్తల సమావేశంలో పాల్గొని దిశానిర్దేశం చేస్తారని పార్టీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు కేతావత్ యాదగిరి తెలిపారు. సాయంత్రం 6గంటలకు హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరుతారు.

ప్రజావాణికి 112 ఫిర్యాదులు



నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 112 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తోపాటు ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్, ఏసీపీ వెంకటేశ్వర్ రావుకు వివరిస్తూ ఫిర్యాదులను అందజేశారు. ఫిర్యాదులను పెండింగ్‌లో ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు



వర్ని : జిల్లాలో రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ అన్నారు. మోస్రా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సహకార సంఘ భవనంతోపాటు గిడ్డంగిని సోమవారం ఆయన ప్రారంభించారు. రైతులు సహకార సంఘాల ద్వారా తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలను చెల్లించి తిరిగి రుణాలు పొందాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులు బిల్లులు తప్పకుండా తీసుకోవాలన్నారు. విండో చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘ఓపెన్’ ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ రుసుంతో ఈ నెల 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు చెల్లించవచ్చునన్నారు. రూ.25 అపరాధ రుసుముతో ఆగస్టు 10 వరకు, రూ 50 అపరాధ రుసుముతో 15వరకు, తాత్కాల్ రుసుముతో 18వ తేదీ వరకు టీఎస్ ఆన్‌లైన్, మీసేవ సెంటర్లలో చెల్లించాలని పేర్కొన్నారు.

దృష్టిలో పడేందుకు..

- ఆగస్టు 2, 3 తేదీల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో మీనాక్షి నటరాజన్ పర్యటన
- ఆమెతోపాటు పాదయాత్ర, శ్రమదానంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ నాయకుల ప్రణాళికలు



కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే లక్ష్యంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆర్మూర్ నియోజకవర్గంలో పాదయాత్ర చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె దృష్టిలో పడేందుకు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారితో పాటు స్థానిక ఎన్నికల బరిలో నిలువాలనుకుంటున్న నాయకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్ర తమ రాజకీయ భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆగస్టు 2, 3 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నారు. 2న సాయంత్రం ఆర్మూర్ నియోజకవర్గంలో ఆమె పాదయాత్ర చేయనున్నారు. ఇదే నియోజకవర్గంలో రాత్రి బస చేయనున్నారు. 3న ఉదయం శ్రమదానం కార్యక్రమంలో మీనాక్షి పాల్గొననున్నారు. అదేవిధంగా అసంఘటిత కార్మికులతో సమావేశం కానున్నారు. అనంతరం అదేరోజు మధ్యాహ్నం ఉమ్మడి జిల్లాలోని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించి మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేయనున్నారు. ప్రధానంగా జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇప్పటికే మీనాక్షి కృషి చేస్తున్నారు. ఇదిలా ఉండగా మీనాక్షి పర్యటనకు సంబంధించి మంగళవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రూట్‌మ్యాప్ షెడ్యూల్ ఖరారు చేయనున్నారు. ఇందులో భాగంగా సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.

ఎవరి ప్లాన్లు వారివి..

రాహుల్‌గాంధీ కోర్ టీమ్‌లో కీలకమైన నాయకురాలిగా ఉన్న మీనాక్షికి ఢిల్లీలో అధినాయకత్వం వద్ద గట్టి పట్టుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని పలువురు నామినేటెడ్ పదవుల ఆశావహులు, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు, పార్టీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పదవులు ఆశిస్తున్నవారు ఆమె దృష్టిలో పడేందుకు, ఆమెను ప్రసన్నం చేసుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, నగరంలో కార్పొరేటర్లుగా బరిలోకి దిగేందుకు ఉవ్విళ్లూరుతున్నవారు. జెడ్పీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్లు, నగర మేయర్ పదవులు ఆశిస్తున్నవారు, రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ పదవులు కోరుతున్న వారు మీనాక్షి దృష్టిలో పడేందుకు గట్టి ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎట్టిపరిస్థితుల్లో పదవులు దక్కించుకునేందుకు ఎవరి పాట్లు వారు పడుతున్నారు. ఇక మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులు, జిల్లా కాంగ్రెస్ పదవి రేసులో ఉన్నవారు సైతం ఈ పర్యటనను సద్వినియోగం చేసుకునేందుకు ఎవరి ప్లాన్లు వారు వేసుకుంటున్నారు.

నాలుగేళ్ల క్రితం జిల్లాలో పాదయాత్ర..

రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ చైర్మన్‌గా నాలుగేళ్ల కిందట మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పాదయాత్ర నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఇందల్వాయి మండలం సిర్నాపల్లి నుంచి ఆమె పాదయాత్ర నిర్వహించారు. జక్రాన్‌పల్లి మండలంలో, ఆర్మూర్ మండలంలో, బాల్కొండ మండలాల్లోనూ ఆమె ఆ సమయంలో పాదయాత్ర చేశారు. అప్పటి పాదయాత్రలో పాల్గొన్న నాయకులతో మీనాక్షి ఇప్పటికీ నిరంతరం మాట్లాడుతూ వివరాలు తెలుసుకుంటున్నారు. ఇదిలా ఉండగా పూర్తిగా గ్రామీణ ప్రాంతాలపైనే ఆమె ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారు. గతంలో మీనాక్షి పాదయాత్ర చేశాక జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించామని, ఈసారి సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ గెలుపును నమోదు చేస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం మీనాక్షి నటరాజన్ చేయనున్న పాదయాత్ర, శ్రమదానం కార్యక్రమాల్లో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ కూడా పాల్గొననున్నారు.



రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం

రవాణాశాఖలో ఫీజుల మోత!

- రూ.50 నుంచి రూ.వెయ్యి వరకు పెంపు
- ఆదివారం నుంచి ట్రాన్స్‌పోర్ట్ వెబ్‌సైట్‌లో అప్‌డేట్

ఖలీల్‌వాడి : రవాణాశాఖ ఫీజుల మోత మోగించింది. ఆదివారం నుంచి పెరిగిన ఫీజులు అమలులోకి వచ్చాయి. దీంతో వాహనాదారులు, లైసెన్స్‌దారులకు రవాణాశాఖ సేవలు మరింత భారం అవుతున్నాయి. ఎలాంటి బహిరంగ ప్రకటన లేకుండానే రవాణాశాఖ పలు సేవల ధరలను పెంచుతూ ఆ శాఖ వెబ్‌సైట్‌లో నూతన ఫీజులను అప్‌డేట్ చేసేసింది. పలు సేవల ఫీజులు కొంత పెరగగా, మరికొన్నింటి ఫీజులు వాహనాదారులకు భారం కానున్నాయి. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజు సైతం మారింది. గతంలో రవాణాశాఖ అధి కారులు ఫీజుల పెంపునకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించగా, ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం.

పెరిగిన చార్జీలు ఇలా (రూపాయల్లో..)

	పాత ఫీజు	కొత్త ఫీజు
లెర్నర్స్ లైసెన్స్	335	440
రెండు కేటగిరీలు		
టూ వీలర్, కారు లర్నర్స్ లైసెన్స్	450	585
పర్మినెంట్ లైసెన్స్ డ్రైవింగ్ టెస్ట్	1,035	1,135
వాహనాల యాజమాన్య బదిలీ	935	1,805
హైపాథికేషన్ (ఫైనాన్స్)	2,135	3,135
రుణ బదిలీ	2,445	2,985
ఆటోరిక్షా డ్రైవింగ్ టెస్ట్	800	900

పెరిగిన ఫీజుల ప్రకారం..

పెరిగిన సర్వీస్ చార్జీల ప్రకారం సోమవారం నుంచి లైసెన్స్‌లు జారీ చేశాం. వాహనాల రిజిస్ట్రేషన్ ఫీజులు కాకుండా కేవలం సర్వీస్ చార్జీలను రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసింది. సోమవారం నుంచి పెరిగిన సర్వీస్ చార్జీల ప్రకారం వినియోగదారులకు వివిధ రకాలు వాహనాల పత్రాలను అందిస్తున్నాం.

– ఉమామహేశ్వర్‌రావు, డీటీవో, నిజామాబాద్

కేజీబీవీలలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందల్వాయి, నందిపేట్, నవీపేట్, ఆర్మూర్, నిజామాబాద్, మోపాల్ కేజీబీవీలలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు. భీమ్‌గల్, మోర్తాడ్, ధర్పల్లి, కమ్మర్‌పల్లి , కోటగిరి, ఎడపల్లి, వేల్పూర్, సిరికొండ కేజీబీవీలలో ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్సారెస్పీలోకి 68,516 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో




ఎస్సారెస్పీలో ప్రస్తుతం నిల్వ ఉన్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతమైన మహారాష్ట్ర నుంచి వరద నీరు వస్తోంది. ప్రాజెక్ట్‌లోకి 68,516 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉదయం నుంచి క్రమక్రమంగా వరద పెరుగుతూ రాత్రి 7 గంటల వరకు 53 వేల క్యూసెక్కులకు చేరింది. నిలకడగా అంతే స్థాయిలో సోమవారం ఉదయం 3 గంటల వరకు వరద కొనసాగింది. అనంతరం వరద నీరు 68,516 క్యూసెక్కులకు పెరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిలకడగా అంతేస్థాయిలో వరద వచ్చింది. సాయంత్రం 4 తర్వాత 65,740 క్యూసెక్కులకు తగ్గింది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా పెరిగింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా సోమవారం సాయంత్రానికి 1074.60 (30 టీఎంసీలు) అడుగులకు పెరిగినట్లు పేర్కొన్నారు.

ఆయకట్టు రైతులు ఆందోళన చెందొద్దు

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులు ఆందోళన చెందొద్దని ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి అన్నారు. సోమవారం ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని పరిశీలించారు. ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి మరో రెండు రోజుల పాటు వరద కొనసాగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం వస్తున్న వరదతో ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ 35 టీఎంసీలకు చేరుకుంటుందన్నారు. ఖరీఫ్‌లో పంటలకు కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టాలంటే 50 టీఎంసీలకు ప్రాజెక్ట్ నీటి నిల్వ చేరాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు మరింత వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



నిజాంసాగర్‌లోకి 1,172 క్యూసెక్కులు..

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం సాయంత్రం 1,172 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లో తగ్గిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 1,391.22 అడుగుల (4.58 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు

- ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తుంది
- కార్డులు రాని వారు ఆందోళన చెందొద్దు
- అర్హులు దరఖాస్తు చేసుకోవాలి..
- కొత్త కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు కార్డుల పంపిణీ



లబ్ధిదారుకు రేషన్‌కార్డు మంజూరుపత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్: ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గౌరవిస్తుందని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, ఇంకా అర్హులు మిగిలి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో షబ్బీర్ అలీ, అదనపు కలెక్టర్ అంకిత్ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ మాట్లాడుతూ.. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 11,852 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని, మరో 84,232 మంది పేర్లను కొత్తగా లబ్ధిదారుల జాబితాలో చేర్చడం జరిగిందన్నారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని నార్త్, సౌత్ మండలాల పరిధిలో 3,174 కుటుంబాలకు కొత్త కార్డులు ఇవ్వడంతోపాటు 16,687 మంది సభ్యుల పేర్లను కొత్తగా నమోదు చేసినట్లు వివరించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అందించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అవలంబించిన అసంబద్ధ పాలనా విధానాల కారణంగా రూ.7.80 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సన్న బియ్యం పంపిణీ బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు దేశంలో మరెక్కడా లేదని, కేవలం తెలంగాణలోనే అమలవుతోందని అన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో లబ్ధిదారుకు రూ.5 లక్షలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దని, ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని షబ్బీర్ అలీ హెచ్చరించారు.

అదనపు కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. రేషన్ కార్డుల పంపిణీ పారదర్శకంగా కొనసాగుతోందని తెలిపారు. అర్హులకు మాత్రమే కార్డులు మంజూరయ్యేలా పకడ్బందీగా పరిశీలన చేపడుతున్నామన్నారు. ఇంకా దరఖాస్తుల వెరిఫికేషన్ కొనసాగుతోందని, అర్హత కలిగిన కుటుంబాలకు కార్డులు మంజూరు చేస్తామని అన్నారు.

కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్‌కాంత్, ఆయా శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తొండాకూర్ - దత్తాపూర్ రోడ్డుపై పందిరి వేసినట్లుగా పచ్చని చెట్లు



దొంకేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో విరగ బూసిన తంగెడు చెట్టు

పందిరేసినట్లు... పూలు పరిచినట్లు

వర్షాకాలం కావడంతో అంతటా పచ్చదనం సంతరించుకుంది. దొంకేశ్వర్ జెడ్పీ పాఠశాలలో ఓ భారీ తంగెడు వృక్షానికి పూలు విరగబూశాయి. అవే పూలు రాలి నేలపై పసుపు వర్ణాన్ని పరిచినట్లుగా కనిపిస్తున్నాయి. అదే విధంగా తొండాకూర్ నుంచి దత్తాపూర్ వెళ్లే మార్గంలో కిలో మీటరు పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు పందిరి వేసినట్లుగా ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. చూపరులను ఆకర్షిస్తున్న ఈ చిత్రాలను ‘సాక్షి’ తన కెమెరాలో బంధించింది. – దొంకేశ్వర్(ఆర్మూర్)

కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

- స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం
- పేదలకు అందని ద్రాక్షలా ఇందిరమ్మ ఇళ్లు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: ఎన్నికల హామీలను నెరవేర్చకపోవడంతో కాంగ్రెస్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు బీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపుతున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తామన్నారు. ఇందూరు గడ్డ నుంచే కాంగ్రెస్ పూర్తిస్థాయిలో మట్టికరుస్తుందన్నారు. కాంగ్రెస్ హయాంలో సెటిల్‌మెంట్లు, దోపిడీలు పెరిగిపోయాయి ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం వద్దు.. కేసీఆర్ రాజ్యం ముద్దు.. నినాదంతో ముందుకు వెళ్తామని, గ్రామగ్రామాన పార్టీలను శ్రేణులను సమాయత్తం చేస్తామన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మళ్లీ కేసీఆర్ రావాల్సిందేనని అన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందని ద్రాక్ష లా మారాయని, ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్‌కు అతీగతీ లేదని, నిరుద్యోగ భృతిని మరిచిపోయారన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, ప్రభాకర్, భూమేశ్, నరేందర్, సంతోష్, రజినీశ్, వెల్మల్ సురేశ్, సుంకర రవి, రంజిత్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి

క్లుప్తంగా

సరిహద్దు తేల్చాలి



రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి ఇసుక తరలించే కొడిచర్ల, పోతంగల్‌కు చెందిన ట్రాక్టర్ యజమానులు సోమవారం తహసీల్ కార్యాలయానికి తరలి తరలివచ్చారు. మంజీర నుంచి ఇసుక తరలించే శివారు సరిహద్దు తేల్చాలని కొడిచర్ల గ్రామస్తులు డిమాండ్ చేశారు. పోతంగల్ వే బిల్లు తీసుకుని కొడిచర్ల శివారు నుంచి ఇసుక తీసుకెళుతున్నారని ఫిర్యాదు చేశారు. తమ శివారు నుంచి ఇసుక తరలింపును నిలిపివేయాలని తహసీల్దార్ గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ ఇసుక ట్రాక్టర్లను నిలిపివేశారు. స్థానికంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారుల వివరాలు సేకరించి అవసరమగు వారికి సరఫరా చేయాలని జీపీ కార్యదర్శికి సూచించారు.

ఎన్‌డీఎస్‌ఎల్‌ను పునరుద్ధరించాలి



నిజామాబాద్ అర్బన్: ఎన్డీఎస్ఎల్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఎంసీపీఎం నాయకులు సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి మైత్రి రాజశేఖర్ మాట్లాడుతూ చక్కెర కార్మాగారం మళ్లీ ప్రారంభిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేకమందికి ఉపాధి కలుగుతుందన్నారు. సీమాంధ్ర పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ ఫ్యాక్టరీ నష్టాలు ఊబిలోకి వెళ్లిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఫ్యాక్టరీని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామెల్ నరసయ్య, అంజయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల ప్రజలను ఆదుకోండి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ముంపునకు గురైన గ్రామాల ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సోషల్ మీడియాలో దేశ తొలి ప్రధాని నెహ్రూ ఫొటో, ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో ప్రభుత్వాలు ఇచ్చిన పరిహారం, హామీలతో కూడిన ఓ పోస్టు వైరల్ అవుతోంది. అందులోని సారాంశం ఇదే.. 'శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 1963లో దేశ తొలి ప్రధాని నెహ్రూ శంకుస్థాపన చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన 36 గ్రామాలు, ఆదిలాబాద్ జిల్లా (ప్రస్తుతం నిర్మల్ జిల్లా)కు చెందిన 56 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఆకాలంలో ఎకరానికి రూ.600, ఇంటికి రూ.5 వేలలోపు పరిహారం అందించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలి' అని పేర్కొన్నారు.

తాళాలు వేసిన మూడు ఇళ్లలో చోరీ

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో మూడు ఇళ్లలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. మద్నూర్‌కు చెందిన లైబ్రెరియన్ కపిల్ కుటుంబసభ్యులు కామారెడ్డికి వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. దుండగులు తాళాలను పగులగొట్టి ఇంట్లో దాచిపెట్టిన రూ. 40 వేల నగదు అపహరించుకు వెళ్లారు. సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు కపిల్ తెలిపారు. కాలనీలోని మరో రెండు ఇళ్ల తాళాలను దుండగులు పగులగొట్టారని స్థానికులు తెలిపారు. కాగా, నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని పేర్కొన్నారు.

కొందరికే పీఎం కిసాన్

- ఐదేళ్లుగా నమోదుకు అవకాశం కరువు
- లక్ష్యం చేరని ఫార్మర్ ఐడీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ



ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం జిల్లాలో కొందరు రైతులకే ప్రయోజనం కలుగుతోంది. 2019 జనవరి 31వ తేదీ వరకు పట్టాపాస్ పుస్తకాలు కలిగిన సన్న, చిన్నకారు రైతులనే ఈ పథకానికి అర్హులుగా గుర్తించి సాగుకు పెట్టుబడిగా ఏడాదికి మూడు విడతల్లో కలిపి రూ.6వేలు రైతుల ఖాతాల్లో వేస్తోంది. ఆ తర్వాత పట్టా పాస్ పుస్తకాలు పొందిన వారు ఈ పథకంలో నమోదుకు అవకాశం ఇవ్వడం లేదు. దీంతో చాలా మంది రైతులు పీఎం కిసాన్ పథకానికి దూరమవుతున్నారు. తహసీల్ కార్యాలయాల్లో సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్, సక్సెషన్, వారసత్వపు బదిలీల రూపంలో నిత్యం పదుల సంఖ్యలో భూలావాదేవీలు జరుగుతుంటాయి. ఇలా నూతన పట్టాలు పొందిన రైతులు పీఎమ్ కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో చేరేందుకు నిబంధనలు అడ్డుపడుతున్నాయి. పీఎం కిసాన్ డబ్బులు వచ్చిన రైతు ఎవరైనా చనిపోతే వారి ద్వారా వారసత్వపు పాసు పుస్తకాలు పొందిన రైతులను మాత్రమే నూతనంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలో చేర్చే అవకాశం ఉంది.

35 శాతం మందికే..

జిల్లాలో 2,65,000 మంది రైతులు ఉండగా అందులో కేవలం 88,000 మంది రైతులకు(35 శాతం) పీఎం కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు అందుతున్నట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పట్టాలు పొందిన రైతులెవ్వరికీ ఈ పథకం వర్తించడం లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పథకాల అమలులో సౌలభ్యం కోసం అర్హులైన రైతులందరికీ విశిష్ట గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు కేంద్రం ప్రకటించింది. అందుకోసం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాంకేతిక సమస్యలు, రైతుల్లో అవగాహన లేమితో నత్తనడకన సాగుతోంది. జిల్లాలో మొత్తం 2,91,749 పట్టా పాస్‌బుక్‌లు ఉంటే ఇప్పటి వరకు 1,40,285 మందే రిజిస్ట్రేషన్ చేయించుకోవడం(48.08 శాతం) అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

నాలుగేళ్లుగా డబ్బులు రావట్లేదు



నా భర్త చనిపోయిన తర్వాత మూడున్నర ఎకరాలు నా పేరు మీద చేయించుకున్నాను. నాలుగేళ్లుగా పీఎం కిసాన్ డబ్బులు రావట్లేదు. వ్యవసాయ అధికారుల వద్ద ఎన్నిసార్లు నమోదు చేసినా ఆన్‌లైన్ కావట్లేదు. దాదాపు రూ. 24 వేలు నష్టపోయాను. ఇకనైనా అధికారులు నా సమస్యకు పరిష్కారం చూపాలి.

– నోముల అంజమ్మ, నల్లవెల్లి

కటాఫ్ తేదీని మార్చాలి



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కటాఫ్ తేదీని తొలగించి అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలి. పరిమితి విధింపుతో ఐదేళ్లుగా ఎందరో రైతులు ఈ పథకానికి దూరమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇస్తున్నట్లుగా ఒకే ఇంట్లో ఎంతమంది రైతులున్నా అందరికీ ఈ పథకం వర్తింపజేయాలి.

– అన్వేష్ రెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

వేగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. సాంకేతిక సమస్యలతో ప్రక్రియ సజావుగా సాగడం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తికి గడువు లేదు. రైతులు కంగారు పడవద్దు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన వారిని చేర్చేలా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– మేకల గోవిందు, డీఏవో

ఆహార పదార్థాలు కలుషితం కాకుండా చూడాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల తనిఖీ



ధర్మారం(బి)లోని ఎంజేపీ గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఆహార పదార్థాలను కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, శుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీలను పరిశీలించారు. ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని, ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి ప్రత్యేక బోధన అందిస్తూ, మరింత మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యవేక్షణ అధికారి ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని సూచించారు. గురుకులంలో ఇంకా ఏమైనా సదుపాయాలు అవసరం ఉన్నాయా అని ప్రిన్సిపల్ శ్రీకర్‌ను అడిగి తెలుసుకున్నారు.

గుంజిళ్ల మాస్టారుకు 'ఆయుష్ ఉదయ్ సమ్మాన్' అవార్డు



అవార్డు అందుకుంటున్న అందె జీవన్‌రావు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్, గుంజిళ్ల మాస్టారుగా పేరొందిన అందె జీవన్‌రావు 'ఆయుష్ ఉదయ్ సమ్మాన్' అవార్డు అందుకున్నారు. ఆదివారం దక్షిణ గోవాలోని ఐటీసీ ఫార్చ్యూన్ రిసార్ట్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆయుష్ కాంక్లేవ్ సదస్సులో అందె జీవన్ రావుకు గోవా కార్టోరిమ్ నియోజకవర్గ ఎమ్మెల్యే, గోవా పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అలెక్సో రెజినాల్డో లారెంకో అవార్డు అందజేశారు. ఈ సదస్సులో అందె జీవన్ రావు 'సూపర్ బ్రెయిన్ యోగా- ఎన్ అప్రొప్రియేట్ యోగిక్ ఎక్సర్ సైజ్ ఫర్ సుపీరియర్ ఇంటలెక్ట్ అండ్ వెల్ బీయింగ్' అనే అంశంపై తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలి

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



హమాల్‌వాడీ సంతోషిమాత సాయిబాబా ఆలయ కమిటీ..



జెండాబాలాజీ ఆలయ కమిటీతో ప్రమాణం చేయిస్తున్న దేవాదాయ శాఖ పరిశీలకులు కమల, పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కార్పొరేషన్ల చైర్మన్లు తాహెర్, మానాల తదితరులు

నిజామాబాద్ రూరల్: ఆలయాల అభివృద్ధికి చైర్మన్‌తో సహా కమిటీ సభ్యులు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. నగరంలోని జెండా బాలాజీ, శంభుని గుడి, సంతోషిమాత సాయిబాబా ఆలయ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం ఆయా ఆలయాల్లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షబ్బీర్ అలీ హాజరై మాట్లాడారు. మూడు ఆలయాలు చాలా మహిమలుగలవని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. జెండా బాలాజీ ఆలయ కమిటీ చైర్మన్‌గా లవంగ ప్రమోద్ కుమార్, డైరెక్టర్లుగా పాలకొండ నర్సింగరావు, సిరిపురం కిరణ్ కుమార్, వేముల దేవిదాస్, మంత లక్ష్మణ్, పవర్ విజయ, కోరవ రాజ్‌కుమార్, శంభుని గుడి ఆలయ కమిటీ చైర్మన్ బింగి మధు, డైరెక్టర్లుగా గాజుల కిశోర్, గాండ్ల సంతోష్ కుమార్, కమల్ కిశోర్ దయ్మా, మామిడి శేఖర్, ఉప్పల రమేశ్, గోపు రేఖ, సంతోషిమాత సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్‌గా బొత్కం గంగాకిషన్, డైరెక్టర్లుగా శ్రీరాం రమేశ్, గాదె ప్రవీణ్ కుమార్, బాణాల శివ లింగం, కోర్తే శాంతాబాయిలతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతి రాజిరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఒకరి మృతి



నారాయణ (ఫైల్)

కామారెడ్డి క్రైం: టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి పైకి ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు దూసుకువచ్చిన ఘటన జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పైడాకుల నారాయణ (55) కామారెడ్డి- సిరిసిల్లా రోడ్‌లోని ధర్మశాల పక్కన ఉండే ఫర్నీచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై విధులకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. తలకు తీవ్ర గాయాలు కావడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి ఒకరి మృతి



బోధన్: నిజామాబాద్-జానకంపేట రైల్వేస్టేషన్ల మార్గమధ్యలో సోమవారం గుర్తు తెలియని రైలు కిందపడి 60 నుంచి 65 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు నిజామాబాద్ రైల్వేస్టేషన్ మేనేజర్ చందన్ కుమార్ తెలిపారు. మృతుడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని రైల్వే అధికారులు అనుమానిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని రైల్వే ఎస్సై సాయరెడ్డి పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే 87126 58591 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బోటింగ్‌కు వెళ్లి సరస్సులో పడిపోయి..

- అమెరికాలో ఎత్తొండ క్యాంపు వాసి మృతి



హరికృష్ణ (ఫైల్)

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ క్యాంపునకు చెందిన వడ్లమూడి హరికృష్ణ (49) అమెరికాలో ప్రమాదవశాత్తు సరస్సులో మునిగి మృతి చెందిన ఘటన మూడు రోజుల క్రితం (శనివారం) చోటు చేసుకుంది. సరదాగా బోటింగ్‌కు వెళ్లిన హరికృష్ణ సరస్సులో మునిగి మృతి చెందాడన్న సమాచారంతో ఎత్తొండ క్యాంపులో విషాదఛాయలు అలుముకున్నాయి. హరికృష్ణకు భార్య శిల్ప, కూతుళ్లు యుక్త, సరయు ఉన్నారు. 25ఏళ్ల క్రితం ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. కుటుంబసభ్యులతో కలిసి ఏడాది, రెండేళ్లకోసారి ఎత్తొండ క్యాంపునకు వచ్చి స్నేహితులు, బంధువులతో గడిపి వెళ్లేవారు. ఆరు నెలల క్రితం హరికృష్ణ తల్లిదండ్రులు సరస్వతి, రాధాకృష్ణ అమెరికా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. కాగా, హరికృష్ణ అంత్యక్రియలు అమెరికాలోనే నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు

వర్ని: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సోమవారం బోధన్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయి శివ తీర్పునిచ్చారు. ఈ నెల 20న బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన ఓల్లెపు పాపయ్య మద్యం తాగి వాహనం నడుపుతుండగా వర్ని మండల కేంద్రంలో పట్టుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



వర్ని (మోస్రా): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు వర్ని ఎస్సై మహేశ్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున రెండు టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా మోస్రా శివారులో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ టిప్పర్లు సాలూర శివారులోని మంజీర పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్ మీటరుపై పేరు మార్చాలా?

మీకు తెలుసా?



కరెంట్ బిల్లు

కమ్మర్‌పల్లి: విద్యుత్ మీటరుపై పేరు మార్పు కోసం వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సంస్థ వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది.

- టీజీఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌ను తెరిచి 'కన్స్యూమర్ సర్వీసెస్'పై క్లిక్ చేస్తే పలు సేవలు కన్పిస్తాయి. అందులో సర్వీస్ రిక్వెస్ట్ విండోపై క్లిక్ చేయాలి.
- కరెంట్ బిల్లుపై ఉండే యూనిక్ సర్వీస్ నెంబరు, మొబైల్ నెంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే అక్కడ అందించే సర్వీసులు కన్పిస్తాయి.
- వాటిలో టైటిల్ ట్రాన్స్‌ఫర్, చిరునామా మార్పు, అదనపు లోడు, లైన్ల మార్పు, కేటగిరి మార్పు వంటివి ఉంటాయి.
- టైటిల్ ట్రాన్స్‌ఫర్‌పై క్లిక్ చేసి అవసరమైన మూడు డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- రిజిస్టర్డ్ సేల్ డీడ్/గిఫ్ట్ డీడ్, వ్యక్తిగత గుర్తింపు పత్రం(ఏదైనా ఐడీ), రూ.100 నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపరుతో కూడిన ఇండెమ్నిటీ బాండ్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- బాండ్‌కు సంబంధించిన ఫార్మాట్ కూడా అక్కడే ఉంటుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు సమర్పించాలి.
- గుర్తింపు పత్రం జేపీజీ/పీఈజీ ఫార్మాట్‌లో ఉండాలి. వీటి సైజు 100కేబీ లోపు, ఇండెమ్నిటీ బాండ్ పీడీఎఫ్ రూపంలో 500 కేబీ లోపు, రిజిస్టర్డ్ డాక్యుమెంట్ పీడీఎఫ్ 5ఎంబీ లోపు సైజు ఉండే విధంగా జాగ్రత్త తీసుకోవాలి.
- అన్ని డాక్యుమెంట్లపై సంతకం తప్పనిసరి. ఆ తర్వాతే అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సర్వీస్ చార్జ్ రూ.25 చెల్లించాల్సి ఉంటుంది.
- తర్వాత విద్యుత్ శాఖ వారు వివరాలన్నీ పరిశీలించి, అన్ని సరిగా ఉంటే మీ బిల్లుపై పేరును మార్పు చేస్తారు.

భావితరానికి స్ఫూర్తినిచ్చే.. బతుకు చిత్రం



పదేళ్ల కిందటి వరకు ఏ గ్రామానికి వెళ్లినా ఎడ్లబండ్లు కనిపించేవి. పొలాల్లో దుక్కులు చేయాలంటే నాగళ్లు, అరకలు వాడేవారు. అందుకు ఎడ్లు అవసరం. పండిన పంట ఇంటికి చేర్చాలంటే ఎడ్లబండ్లు వాడేవారు. వ్యవసాయంలో నేడు యాంత్రీకరణ పెరిగిపోయింది. ఎక్కడా ఎడ్లబండ్లు కనిపించడం లేదు. చదును చేయడం, దుక్కులు దున్నడానికి ట్రాక్టర్లు వచ్చేశాయి. నేటి తరానికి పాత వ్యవసాయ పద్ధతులు తెలిసేలా మోస్రా మండలం చింతకుంట గ్రామస్తులు చందాలు వేసుకొని గ్రామముఖ ద్వారం వద్ద ఎడ్లబండిపై రైతు దంపతులు ధాన్యం తరలించే విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఉపాధి హామీ పనులు భేష్

- గ్రామీణ అభివృద్ధి శాఖ జాతీయ పర్యవేక్షకులు సుధాకర్ రెడ్డి



జక్రాన్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న జాతీయ పర్యవేక్షకులు సుధాకర్‌రెడ్డి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలో చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు భేషుగ్గా ఉన్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ జాతీయ పర్యవేక్షకులు సుధాకర్ రెడ్డి, లోహిత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జక్రాన్‌పల్లి, చాంద్ మియాబాగ్, మనోహరాబాద్ గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరుపై గ్రామసభలు నిర్వహించారు. బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎలా ఉపయోగపడ్డాయని అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జక్రాన్‌పల్లితో పాటు వేల్పూర్, కమ్మర్‌పల్లి మండలాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీశ్ కుమార్, ఎంపీవో యూసుఫ్‌ఖాన్, జీపీ కార్యదర్శులు గంగాధర్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు లేకుండానే ఈజీఎస్ ప్రజావేదిక



ప్రజావేదికలో పాల్గొన్న డీఆర్డీవో సాయాగౌడ్, డీవీవో తదితరులు

బాల్కొండ: మెండోరా మండల కేంద్రంలో సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నాల్గో విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ప్రజలు లేకుండానే నిర్వహించారు. సమాచారం ఇవ్వకుండానే ప్రజావేదిక నిర్వహించడంపై ఉపాధి కూలీలకు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఈజీఎస్ సిబ్బందితోనే కార్యక్రమాన్ని ముగించారు. అంతకుముందు ఆడిట్ వివరాలను డీఆర్పీలు చదివి వినిపించారు. మస్టర్లలో కూలీల పేర్లు నమోదు చేయకపోవడాన్ని గుర్తించారు. కూలీలకు వేతనాలు చెల్లించడం, పేర్లు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో సాయాగౌడ్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో కొండ లక్ష్మణ్, ఇన్‌చార్జి ఏపీవో అశోక్, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అక్కను కాపాడబోయి చెల్లి

- బట్టలు ఉతకడానికి వెళ్లి నీటికుంటలో పడి ఇద్దరూ మృతి
- దోమకొండలో ఘటన



శివాని, మల్లవ్వ మృతదేహాలు

దోమకొండ: బట్టలు ఉతుకుతూ నీటిలో జారిపడిన అక్కతోపాటు కాపాడేందుకు ప్రయత్నం చేసిన చెల్లెలు నీటి కుంటలో పడి మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గోసంగికి చెందిన పలువురు కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. రోజు మాదిరిగానే ఆదివారం సాయంత్రం గంగారపు మల్లేశం కూతుళ్లు పెద్దరాగుల శివాని(23), చిన్నరాగుల మల్లవ్వ (19) బట్టలు ఉతకడానికి నరసింగరాయకుంటకు వెళ్లారు. బట్టలు ఉతికే క్రమంలో అక్క శివాని నీటిలో జారిపడగా, అక్కను కాపాడే ప్రయత్నంలో చెల్లెలు మల్లవ్వ కూడా నీటిలోకి దిగింది. కాగా, ఇరువురు నీటి మునిగారు. స్థానికంగా వ్యవసాయ పనులు చేసి ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. తండ్రి మల్లేశంతోపాటు శివాని భర్త దుర్గయ్య, మల్లవ్వ భర్త రమేశ్ కుంట వద్దకు చేరుకొని ఇరువురి కోసం వెతికారు. ఆదివారం రాత్రి మల్లవ్వ మృతదేహం, సోమవారం శివాని మృతదేహం లభించిందని పోలీసులు తెలిపారు.

గుంతే ప్రాణం తీసిందా...

అక్కాచెల్లెళ్లు బట్టలు ఉతుకుతున్న ప్రదేశంలో నీటి గుంత ఉంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కుంటలోకి నీరు చేరింది. గుంతను గమనించని వారు బట్టలు ఉతికే క్రమంలో నీటిలోకి దిగడంతో ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా ప్రదేశం వద్ద పోలీసులు కట్టెలతో నీటి లోతును పరిశీలించారు. మొదట శివాని నీటిలో పడడంతో, ఆమెను పట్టుకుందామనే ప్రయత్నంలో మల్లవ్వ కూడా నీటిలో మునిగి చనిపోయినట్లు ఎస్సై ప్రవంతి తెలిపారు. తండ్రి గంగారపు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆమె వివరించారు.